మాట్లాడగల దిట్ట. (నేను కలక్టరాఫీసులో పనిచేసినప్పుడు పంచదారకి కంట్రోలు, పర్మిట్లూ వుండేవి. కనకారావు గారు ఒకనాడు మా ఆఫీసుకి (పంచదార పర్మిట్ కోసం) ఒక అప్లికేషను పుచ్చుకొచ్చారు. సివిల్ సప్లయిస్ డెప్యూటీ తాసిల్దార్‌కి తనకేసు రికమెండు చెయ్యమని నన్నుకోరేరు. "మీకూ షుగర్ జబ్బు ఉందా?" అని నేను వేళాకోళానికి అంటేను; "ఏం చెయ్యమంటారు; ఈ రోజుల్లో పరదార అయినా దొరుకుతోంది గాని పంచదార దొరికి చావటంలేదు" అని తిప్పికొట్టేరు!)

సరే, సభలో కనకారావుగారు ఎలా మాట్లాడుంటారో వేరే చెప్పక్కర్లేదు కదా. ఆ తరువాత ఆ హైదరాబాదాయన మాట్లాడుతూ, "ఇది చాలా గొప్ప నవల అనడం స్తవం కాదు; వాస్తవం! నవలలో ఉన్నటువంటి ఉత్కృష్టతకూ కనకారావు గారి ఉపన్యాసంలో ఉన్నటువంటి వినోదాత్మకతకూ మధ్య ఉన్న నేను కాంతాకనకాల మధ్య ఉన్న అనుభూతి పొందుతున్నాను!" అని - తనకి ఇటువేపూ అటువేపూ సార్థకంగా చూపించేరు. అందరూ చప్పట్లు కొడుతూ వుంటే నేను కూడా కొట్టబోయాను. నా పక్కని కూచున్న ద్విభాష్యం రాజేశ్వరరావు "ఈయన ఉపన్యాసానికి సగం చప్పట్లు చాలు!" అని - రెండు చేతులూ కలిస్తేనే కదా చప్పట్లు - అన్న ధోరణిలో ఒక్క చెయ్యే గాల్లో ఆడించేడు. దాంతో ఆ ఉపన్యాసకేసరి గారు ఇతనేదో ఉపన్యాసం ఆపమంటున్నాడనుకుని తక్షణం హింసావిరమణ చేసేరు.

(ఇదంతా కలిపి నేను చెబుదామనుకున్న దాంట్లో సగమే అని సవినయంగా మనవి చేస్తున్నాను.)

★

# 109. సమానత్వ దర్శనం

**మా**ధవరావు అని నా సహాధ్యాయి. నాకులాగే అతనుకూడా డిపార్ట్‌మెంట్‌లో ప్రమోషను రాక "ఫ్రస్టురేటు" అయిపోయాడు. ఓసారి అదేదో ఉత్తరభారత దేశానికి చెందిన యూనివర్సిటీ "ప్రయివేటుగా లా డిగ్రీ" అనే పథకాన్ని ప్రవేశపెట్టినప్పుడు "పోనీ, ఇలా ఉద్యోగం చేసుకుంటూ మరో డిగ్రీ సంపాదించుకుందాం" అని నన్నుకూడా ముగ్గులోకి లాగేడు.

అదుగో, అప్పుడు తెలిసింది మాకు; మన భారతదేశానికి రాజ్యాంగం అంటూ ఒకటి ఉందని. ఎందుకంటే, "లా-ప్రిలిమినరీ" అని మొదటి ఏడాది ఆఖర్ని రాయవలసిన ఐదు పరీక్షల్లో ఒకటి ఏకంగా కానిస్టిట్యూషన్ మీదనే ఉంది.

జనులంతా సమానం అని అందులో ఉండడం చూసి ఈ పేపరు మన కల్పనాశక్తికి మంచి పదును పెడుతుందని చెప్పేడు మాధవరావు.

మాధవరావూ నేనూ ఆ పరీక్షకి వెళ్లలేదు. అప్లికేషను ఫారం, ప్రాస్పెక్టసూ, సిలబస్సూ అవీ తెప్పించుకున్నాం. మొదటి విడత పాఠాలు (స్టెన్సిల్ తీసిన సెట్టు)కి డబ్బు కడితే తప్ప అసలు అవేవీ సరఫరా చెయ్యం అని ఆ యూనివర్సిటీ అంటేను; చెరో యాభై కట్టేక వచ్చేయి అవి. అక్కణ్ణించి "న్యాయశాస్త్రం" మీద, ఆ సిలబస్సు మీద, చర్చించుకోడంతోనే సరిపోయింది మాకు. ముఖ్యంగా "జనులంతా సమానం" అనే విషయం మీద.

బ్రిటిష్ వాళ్లు వెళ్లిపోతున్నప్పుడు మన రైల్వేల్లో ఫస్టుక్లాసూ; సెకండ్ క్లాసూ, ఇంటర్ క్లాసూ, థరుడు క్లాసూ అని మొత్తం నాలుగు క్లాసులుండేవి. వీలున్నంతగా ప్రజల్ని వర్గాలుగా చీల్చి,

వాళ్లల్లో వాళ్లకి తంపులు పెట్టి (విభజించి పాలించి) కులాసా చేసుకునే పర ప్రభుత్వం పోయింది. దాంతో రైల్వేలో గాంధీ క్లాసూ ఇందిరా గాంధీ క్లాసూ అని రెండు క్లాసులు మాత్రం ఉంచాలని మన ప్రభువులు నిర్ణయించేరు. ఇంటర్ క్లాసు, థర్డు క్లాసూ పోయేయి. ఫస్టుక్లాసూ సెకండు క్లాసూ మిగిలేయి.

"కాని, అలా ఎన్నాళ్లో సాగలేదు" అన్నాడు మాధవరావు. "ఇప్పుడు చూడు, బ్రిటీష్ వాడేనయం అనిపిస్తున్నాడు. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, త్రి-టయర్ ఏ.సి., చేర్‌కారు, త్రి-టయర్ స్లీపరు, సెకండ్ అన్ రిజర్వ్‌డ్" అని మొత్తం ఆరు క్లాసులు ఏర్పడ్డాయి.

మాధవరావు ఓసారి "లేడీస్" అనేమాట మీద వివాదాస్పదమైన విభజన చేసి సూచించాడు. సృష్టి వైచిత్రి ప్రకారం పురుషులూ స్త్రీలూ అని రెండు జాతులు కాగా; స్త్రీలలోనే మళ్ళీ రకాలు" అన్నాడు.

"శంఖిని, హస్తిని, చిత్తిని - ఇలాంటి రకాలా?" అన్నారెవరో.

"కాదు"

"కలహాంతరిత, అభిసారిక, వాసక సజ్జిక - అంటారు; అలాగా?"

"కాదు, అవన్నీ ఊహాజనితమైనవి. నేను చెప్పేవి నిజంగా సంఘంలో అమల్లో ఉన్నవి. మహిళలు, స్త్రీలు, ఆడవాళ్లు! మహిళలు - అంటే డబ్బో పలుకుబడో అధికారమో ఉన్నవాళ్లు. స్త్రీలు - అంటే, ఆ గొప్పతనాలు ఏమీ లేకపోయినా మనం మర్యాదగా చూసేవాళ్లు. ఆడవాళ్లు - అంటే మిగిలిన వాళ్లు : కొండొకచో, వోటర్లు. ఈ తేడాలు ముఖ్యంగా ఆర్థిక సంబంధమైనవి; విద్యా సంబంధమైనవి"

మా వూళ్లో సిటీ ప్లానింగు ట్రస్టు అని ఉండేది. క్రమంగా అది అర్బన్ డెవలప్‌మెంట్ బోర్డుగా అభివృద్ధి చెందినప్పుడు అందులో కొన్ని కొత్త పోస్టులు వస్తే మాధవరావు అందులోకి ఓ "ప్లానర్"గా ట్రాన్స్‌ఫరై వెళ్లాడు. బోర్డు పేరిట దఖలు పడియున్న, పడుచున్న, పడబోవుచున్న భూములను లే అవుట్లుగా ప్లాన్లుగీసే ఉద్యోగం. మాధవరావు ఛార్జి తీసుకున్న నాటికి లే అవుటు కాకుండా ఒక పెద్ద భూఖండం బోర్డు పేరిట బదిలీ అయివుంది. "ఈ నూట అరవై ఎకరాల బంజరున్నూ, ఇళ్ల స్థలాలంటూ లేని సామాన్యులకు నామమాత్రపు ధరకి ఇచ్చే పద్ధతిని ప్లాట్లు చేయుటకు గాను బోర్డుకు అప్పగించడమైనది" అని ఉండడం చూసి; రోడ్లకీ పార్కులకీ ఇతర సామాజిక ప్రయోజనాలకీ యాభై అయిదుఎకరాలు వదిలేసి మిగిలిన భూమి అంతటినీ రెండు వందల గజాల చొప్పున రెండువేల మూడువందల ప్లాట్లు చేసి లే-అవుటు చేసేడు. సభలు చేసి సామాన్య ప్రజల ప్రయోజనాలను గురించి మాట్లాడ్డాలూ, పేపర్లలో ఫొటోలూ న్యూసులు వేయించుకోడాలూ - అయ్యేక; ఆ లే-అవుటును పునర్-వ్యవస్థీ కరించేరు. హెచ్ఐజి; ఎమ్ఐజి(వన్); ఎమ్ఐజి(టు); ఎల్ఐజి(ఎ); ఎల్ఐజి(బి); ఇడబ్ల్యుఎస్; అని మొత్తం నగరంలోని ప్రజలను ఆరువర్గాలుగా విభజించి పాలించింది బోర్డు. కొత్త లే అవుటులో ప్లాట్లు ఆరువందల అరవై గజాల నుంచి అరవయ్యారు గజాలదాకా విస్తీర్ణాలతో ఏర్పడ్డాయి.

మాధవరావు ఆ ఉద్యోగం మానేసి మళ్లీ మా ఆఫీసుకే వచ్చేశాడు. సమసమాజ స్థాపన, జనులంతా సమానంగా ఉండడం ఇలాంటివి మనకి అచ్చిరావని అన్నాడు. "ఇన్ డెమోక్రసీ, ఆల్ పీపుల్ ఆర్ ఈక్వల్, బట్ సమ్ పీపుల్ ఆర్‌మోర్ ఈక్వల్ దేన్ అదర్స్" (ప్రజాస్వామ్యంలో జనులంతా సమానం. కాని, కొందరు జనులు మిగతా వాళ్లకంటె ఎక్కువ సమానం) అని ఒక అప్రాచ్యుడు (పడమటి దేశం వాడు) అన్నాడట.

★